www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 21 నవంబరు 2022

5

పశ్చిమ గోదావరి

నిందితుడిని అరెస్ట్ చేయాలి

ఐద్వా నేతల డిమాండ్

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడు అబ్రహంను వెంటనే అరెస్ట్ చేయాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఆదివారం మహిళను ఐద్వా నేత డోకల లక్ష్మి, సందక ఉదయ కుమారి, బి.పార్వతి పరామర్శించారు. జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. ప్రతిరోజూ ఎవరైనో ఒకరిని వేధిస్తూ ఉండే వైసిపి నాయకుడు అబ్రహం ఇటీవల పని నిమిత్తం వీధి గుండా వెళ్తున్న మహిళను బలవంతం చేయబోయాడని, తప్పించుకొని బాధితురాలు పారిపోయిందని తెలిపారు. విచారించిన పోలీసులు మూడు రోజులైనప్పటికీ నిందితుడిని అరెస్టు చేయలేదని, వెంటనే అబ్రహంను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు.

హామీలు.. శంకుస్థాపనలేనా..

కార్యాచరణ ఎప్పుడో..!

- వాటర్‌గ్రిడ్ పథకంపై ఆర్భాటపు ప్రకటనలు
- ఫిషింగ్ హార్బర్ కల సాకారమయ్యేదెన్నడో
- తీర ప్రాంతానికి ఫుడ్ పార్కు తరలింపు మరిచారే
- గోదావరిపై వంతెన నిర్మాణం మాటేమిటో
- నేడు నరసాపురంలో సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

సిఎం జగన్ సోమవారం నరసాపురంలో పర్యటించనున్నారు. సుమారు రూ.రెండు వేల కోట్లకుపైగా విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. నూతనంగా భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారి సిఎం ఈ జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లావాసులు సిఎం జగన్ తమ సమస్యలపై స్పందించాలని కోరుతున్నారు.

నాడు ప్రతిపక్ష నేతగా జగన్ పాదయాత్ర ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లాలో ప్రధాన పట్టణాల మీదుగా సాగింది. ఆ సందర్భంగా పలు హామీలు ఇచ్చారు. అలాగే ఎన్నికల ప్రచారంలోనూ స్పష్టమైన హామీలు మరోసారి గుప్పించారు. అయితే వాటిలో కొన్నింటికి సంబంధించి సోమవారం శంకుస్థాపనలు చేయనుండగా మిగిలిన వాటి సంగతేంటని జనం ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా డెల్టా వాసుల ప్రాణాలను హరిస్తున్న కలుషిత నీటి నుంచి కాపాడి అందరికీ రక్షిత నీరు అందించేలా వాటర్‌గ్రిడ్ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకొచ్చాక అప్పటి మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కూడా వేల కోట్లు ఈ పథకానికి కేటాయించినట్లు ప్రకటనలు గుప్పించారు. అయితే అవేమీ గడప దాటలేదు. దీంతో శంకుస్థాపన స్థాయి దాటని పరిస్థితి ఉంది. మరోసారి తాగునీటి సరఫరాకు పథకం అంటూ శంకుస్థాపన చేయనున్నారు. ఇదైనా ఎప్పటికి కార్యరూపం దాల్చుతుందోనని అంతా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలోనూ, ఈ ప్రభుత్వ హయాంలోనూ శంకుస్థాపనల పర్వం సాగుతూనే ఉంది. ఇక కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం అనేది ఈనాటిది కాదు. అందువల్ల వీటన్నింటికీ శంకుస్థాపన చేయడం సంతోషకరమే అయినా ఎప్పటికి కార్యరూపం దాల్చుతున్నాయనేది ప్రశ్నార్థకమేనని అంతా వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక మిగిలిన హామీల మాటేమిటని ఆయా ప్రాంతాల వాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో తుందుర్రు ప్రాంతంలో నిర్మాణం చేపట్టిన మెగా ఆక్వా ఫుడ్ పార్క్‌కు వ్యతిరేకంగా జనం పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం అదే రీతిలో నిర్బంధకాండకు పాల్పడింది. అక్రమ కేసులు బనాయించి రోజుల తరబడి జైళ్లలో నిర్బంధించింది. ఆ సందర్భంగా ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ ఈ ప్రాంత పర్యటన సందర్భంగా తాము అధికారంలోకి రాగానే ఫుడ్‌పార్క్‌ను తీర ప్రాంతానికి తరలిస్తామని ప్రకటించారు. జగన్ అధికారం చేపట్టి మూడున్నరేళ్లయింది. నాటి నుంచి నేటి వరకూ ఆ ఫ్యాక్టరీ తరలింపు ఊసే లేదు. ఈ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడిన నేతలు, ప్రజలు మాత్రం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. మరి ఈ హామీపై జగన్ నరసాపురం పర్యటనలో పెదవి విప్పుతారో లేదో వేచిచూడాలి.

ఇక నరసాపురం పట్టణాభివృద్ధిలో వెనుకబడటానికి ప్రధాన కారణం గోదావరిపై వంతెన నిర్మాణం జరగకపోవడమేనని ఆ ప్రాంత ప్రజలు, వ్యాపారవేత్తలు తరచూ చెబుతుంటారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి ఎన్‌టిఆర్ ప్రభుత్వ హయాం నుంచి శంకుస్థాపనలైతే చేస్తున్నారుగాని పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇక్కడ గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండటంతో వంతెన డిజైన్‌లో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. శంకుస్థాపన చేస్తున్న నేతలు తర్వాత ఈ కారణాన్ని సాకుగా చూపి పనులను అటకెక్కిస్తున్నారు. మరి సిఎం జగన్ ఈ పర్యటనలో ఈ వంతెన నిర్మాణంపై ఏమైనా స్పష్టతనిస్తారో లేదో వేచిచూడాలి.

కొల్లేరు కాంటూరు కుదింపు అంశం అలానే పెండింగులో ఉంది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని పేదలు ఇప్పటికీ ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే కాళీపట్నం జమిందారీ భూముల అంశం, ఆక్వా కాలుష్యం, అధ్వానంగా తయారైన రోడ్లు, వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటు, నూతన జిల్లా కేంద్రంలో భవనాల నిర్మాణం, వసతుల కల్పన తదితర సమస్యలు సిఎం జగన్‌కు సాదర స్వాగతం పలుకుతున్నాయి. వీటిపై ఆయన ఏమైనా స్పందిస్తారా లేక కేవలం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకే పరిమితమవుతారా అని జనం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్, కలెక్టర్

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు, కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 21వ తేదీ సోమవారం నరసాపురం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి.ప్రసాదరాజు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదివారం 25వ వార్డు నక్కావారిపేట వీవర్స్ కాలనీ ముఖ్యమంత్రి సభా వేదికను, ఆయన ప్రారంభించనున్న వివిధ పథకాలకు సంబంధించి శిలా ఫలకాలను ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు, కలెక్టర్ పి.ప్రశాంతి, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కో -ఆర్డినేటర్, శాసన మండల సభ్యులు తలశిల.రఘురాం కలిసి పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు జారీచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయన్నారు. మిగిలిన కొన్ని పనులు సాయంత్రానికి పూర్తవుతాయన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఏ చిన్న పొరపాటుకూ తావు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, అధికారులు, పలువురు పురపాలక సంఘం కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

సిఎం పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గడిచిన మూడేళ్లలో నియోజవర్గంలో సుమారు రూ.4,850 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు తెలిపారు. దీనిలో రూ.1,180 కోట్లు సంక్షేమ పథకాలకు, రూ.3,700 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు వినియోగించామన్నారు. తీర ప్రాంత మత్స్యకారుల చిరకాల కోరిక ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి నేడు సిఎం చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. సుమారు 450 ఎకరాల్లో రూ.330 కోట్లతో ఆక్వా యూనివర్సిటీ నిర్మాణానికి, రూ.330 కోట్లతో 220 కెవి సామర్థ్యం గల విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి, 62 కోట్ల రూపాయలతో నరసాపురం మున్సిపాలిటీలో డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్, 87 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పేరుపాలెం-గొల్లపాలెం కనెక్టివిటీ బ్రిడ్జికం రెగ్యులేటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె వెంకటరమణ జయరాజు, వెంద్ర వెంకటస్వామి, పెంద్ర వీరన్న, వైసిపి నాయకులు పిడి.రాజు, భూసారపు జయ, చాగంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పేరుపాలెంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ పర్యాటకులతో కళకళలాడింది. కార్తీక మాసం ఆఖరి ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. పిల్లలు, పెద్దలు తారతమ్యం లేకుండా కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. అనంతరం సమీపంలోని ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపక్తి భోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు. సిఐ వాడపల్లి సురేష్ బాబు పర్యవేక్షణలో సిబ్బంది బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. బీచ్‌లో రెవెన్యూ మత్స్యశాఖ ఆరోగ్య పంచాయతీ శాఖల సిబ్బంది విధులు నిర్వహించారు.

సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ధాన్యం కొనుగోలు చేయాలంటూ నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు

జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీలకు కలెక్టర్ కుమారుడు

ప్రజాశక్తి - భీమవరం

జాతీయ స్థాయి చేతిరాత దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో నైపుణ్యం, సృజనాత్మకతను పెంపొందించేందుకు హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ అమ్మఒడి, హ్యాండ్ రైటింగ్ అకాడమీ, ఆల్ ఇండియా గ్రాఫాలజిస్ట్ సంస్థల తరపున నిర్వహించే ఒలంపియాడ్, జాతీయస్థాయి కాలిగ్రఫీ పోటీలకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి కుమారుడు జీవితేష్ ఎంపికయ్యారని హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ అసోసియేషన్, సెక్రటరీ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జీవితేష్ రాష్ట్ర స్థాయి చేతిరాత పోటీల్లో 14 వేల మందిలో మొదటిస్థానం దక్కించుకున్నారని తెలిపారు. ప్రస్తుతం జీవితేష్ 8వ తరగతి, విజయవాడ నలంద విద్యానికేతన్‌లో చదువుతున్నారని తెలిపారు. ఈ పోటీలు దేశవ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా జరుగుతాయని తెలిపారు. 3వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని, రాష్ట్రం నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎక్కువగా పాల్గొంటున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 3 లక్షల మందికి పైగా విద్యార్థులు పాల్గొనే అవకాశం ఉంటుందని జాతీయస్థాయి కాలిగ్రఫీ చేతిరాత నిపుణులు భువనచంద్ర తెలిపారు. ఈ పోటీలు 'నిమిషానికి తగ్గట్టుగా' ఆరు భాగాలుగా పరీక్ష రాయాల్సి ఉంటుందని భువనచంద్ర తెలియజేశారు. జీవితేష్ రాష్ట్ర, జాతీయస్థాయి ఒలంపియాడ్ పోటీలకు ఎంపికవ్వడం చాలా ఆనందంగా ఉందని జాతీయస్థాయి కాలిగ్రఫీ చేతిరాత నిపుణులు భువనచంద్ర ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఎంపికైన జీవితేష్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - వీరవాసరం

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలంటూ ఎపి రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం సంఘం కార్యదర్శి తాళ్ళూరి హరిహరరమణ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రైతు సంఘం బృందం మండలంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ 15 రోజులుగా రైతులు ధాన్యాన్ని రాశులుగా పోసి ఉంచినప్పటికీ ఇప్పటి వరకూ ప్రభుత్వ నుంచి కొనుగోలుకు ఎవరూ రాలేదన్నారు. ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు జాప్యం చేయడం వల్ల రైతులు అందోళన చెందుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు జరగక, మరో పక్క వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆదివారం పేరుతో రైతు భరోసా కేంద్రాలు మూసి ఉండటంతో కొనుగోలు చేయలేదంటూ విమర్శించారు. 75 కేజీల ధాన్యానికి రూ.1,530 ఇస్తున్నారని, పెరిగిన సాగు ఖర్చుల వల్ల దాన్ని రూ.2,100 చేయాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు అమలు చేసి వ్యవసాయాన్ని కాపాడాలన్నారు. ప్రభుత్వ జాప్యం వల్ల, వాతవరణ మార్పులతో రైతులు నష్టపోతే ప్రభుత్వమే వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ బృందంలో జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి, యాళ్లబండి నారాయణమూర్తి, కిలాడి సత్యనారాయణ, మల్లుల సత్యనారాయణ, త్రిమూర్తులు, రాంబాబులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - ఆకివీడు

ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. సిపిఎం కార్యాలయంలో పార్టీ పట్టణ కమిటీ సమావేశం పెంకి అప్పారావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ అధికారంలోకి రాగానే తుందుర్రు ఆక్వా ఫ్యాక్టరీ మూసివేస్తామని ఆనాడు జగన్ హామీ ఇచ్చారన్నారు. మూడున్నర సంవత్సరాలైనా స్పందించని ముఖ్యమంత్రి వేణు ట్రాక్టర్ ఫ్యాక్టరీ, తణుకు షుగర్ ఫ్యాక్టరీ, నూలు మిల్లులు మూతపడినా తెరిపించడానికి కనీసం ప్రయత్నం చేయలేదన్నారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వడం లేదని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని విమర్శించారు. నరసాపురం వద్ద వశిష్ట గోదావరిపై వంతెనను వెంటనే నిర్మించాలని, కాలుష్య సమస్యను పరిష్కరించి రూ.30 కోట్ల పైప్లైన్ పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ విధానం వల్ల రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, విద్యుత్ రాయితీలు కల్పించాలని, మార్కెట్ వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రహదారులు వెంటనే బాగు చేయాలని, మిగులు భూములు పేదలకు పంచాలని, పోరంబోకుల్లో ఉన్న కొబ్బరి చెట్లను దళితులకు పంపిణీ చేయాలని ఆయన కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, పార్టీ పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, బి.సత్యనారాయణ, డోకల లక్ష్మి, పెంకి అప్పారావు, బత్తిన పార్వతి పి.రాంబాబు, కింజరపు శంకర్, జి.రాంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

క్రీడా మైదానాల ప్రయివేటీకరణ సిగ్గుచేటు

ప్రజాశక్తి - ఆచంట

క్రీడా మైదానాలు, స్టేడియాల ప్రయివేటీకరణ నిర్ణయం సిగ్గుచేటని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, జిల్లా కమిటీ సభ్యులు పిల్లి చంటిబాబు విమర్శించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ క్రీడా మైదానాలను, స్టేడియాలను, ఇండోర్ స్టేడియాలను, స్విమ్మింగ్ పూల్స్, జిమ్ సెంటర్లను పే అండ్ ప్లే విధానం పేరుతో ప్రయివేటు కాంట్రాక్టర్లకు లీజుకు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. క్రీడాకారులు మైదానంలోకి అడుగుపెట్టాలంటే సభ్యత్వం రూ.3 వేలు, నెల ఫీజు పదిహేను వందల రూపాయలు చెల్లించి ఆటలు నేర్చుకోవాలంటూ శాప్ ఆదేశాలు జారీ చేసిందని, ఈ నిర్ణయం క్రీడాకారుల పాలిట శాపంగా మారనుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో నిధులు కేటాయించి క్రీడా అభివృద్ధి చేయాల్సిందిపోయి పే అండ్ ప్లే విధానం ప్రవేశపెట్టడం పేద క్రీడాకారులను క్రీడలకు దూరం చేయడమేనని అన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మైదానాల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో డివైఎఫ్ఐగా యువజన, విద్యార్థులను, క్రీడాకారులతో పెద్ద ఎత్తున ఉధృతపర్చి ఆందోళనా పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

శీతాకాలం.. జాగ్రత్తలు అవసరం

చల్లటి పానీయాలు తాగొద్దంటున్న వైద్యులు

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. దీనికితోడు మంచు కురుస్తుంది. శీతాకాలం నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ కాలంలో ఆస్తమా (ఉబ్బసం) వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఇబ్బంది పడతారు. ఊపిరితిత్తుల్లోకి గాలి తీసుకెళ్లే శ్వాసకోశ నాళాల గోడలు ఉబ్బిపోతాయి. దీంతో శ్వాస పీల్చుకోవడం కష్టంగా మారుతుంది. పెద్ద వయసు వారి కంటే ఈ సమస్య పిల్లల్లో ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే వారికి శ్వాస కోస నాళాలు చిన్నవిగా ఉంటాయి. దీంతో వారు అనేక సమస్యలు ఎదుర్కొంటారు. చిన్నారుల్లో ఎక్కువగా వచ్చే అనారోగ్య సమస్యల్లో ఉబ్బసం ఒకటి. శీతాకాలంలో పెద్దల నుంచి పిల్లల వరకూ అందరూ జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు.

ఆస్తమా లక్షణాలు..

దగ్గు, గురక, ఛాతి దిగబడినట్లు ఉండడం, శ్వాస కష్టంగా తీసుకోవడం వంటి లక్షణాలు ఉంటే ఆస్తమాగా భావించాలి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ లక్షణాలు మరింత ఎక్కువగా ఉంటాయి. ఆస్తమాలో బాధితుల్లో శ్వాస తీసుకునే వేగం ఎక్కువగా ఉంటుంది.

కారణాలు..

పొగ తాగడం, వాతావరణ కాలుష్యం వల్ల, చల్లటి గాలి, వాతావరణంలో మార్పులు, దుమ్ములో క్రిములు, జలుబు వంటివి ఆస్తమాకు దారి తీస్తాయి. వారసత్వంగా తల్లిదండ్రుల్లో ఎవరికైనా ఉన్నా, తక్కువ బరువుతో జన్మించిన చిన్నారుల్లో ఈ సమస్య రావొచ్చు. ఇంట్లోని కాలుష్యం, దుమ్ము, దోమల నివారణ మందులు, తలగడలో ఉండే బ్యాక్టీరియా కూడా ఆస్తమాకు కారణాలే. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి అంత బలంగా ఉండదు. వారికి ఆస్తమా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

వైద్యులను సంప్రదించాలి...

ఆస్తమా లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల దగ్గరకు తీసుకెళ్లాలి. ప్రారంభంలోనే చికిత్స అందిస్తే త్వరగా నయం చేయడానికి అవకాశం ఉంటుంది. ఆలస్యం వహిస్తే కోలుకోవడం కష్టమే. బ్రీతింగ్ టెస్ట్ ద్వారా దీన్ని గుర్తిస్తారు. ఎక్సరే, రక్త పరీక్షలు కూడా నిర్వహిస్తారు. ఈ పరీక్షల ద్వారా ఊపిరితిత్తుల పనితీరు ఏ విధంగా ఉంటుందో తెలుస్తుంది.

ఆస్తమాకు చికిత్స..

ఆస్తమాకు రెండు రకాల చికిత్సలు నిర్వహిస్తారు. ఉబ్బసం నుంచి ఉపశమనం కోసం మందులు ఇస్తారు. దీర్ఘకాలంలో ఈ లక్షణాలు రాకుండా కూడా మందులు ఇస్తారు. వైద్యుల సూచనల మేరకు నిర్ణీత సమయంలో మందులివ్వడం అవసరం. చిన్నారులకు వెలేజర్ పెట్టి ఆక్సిజన్ ద్వారా మందులను పీల్చేలా చేస్తారు. రోజులో తగినంత విటమిన్ లభించేలా తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి.

మందుల వాడకంతో పాటు వైపు మరో వైపు ఆస్తమాకు దారితీసే చల్లటి పదార్థాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పోతపాలుతో ఆస్తమా ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. తల్లిపాలు ఉంటే చిన్నారులకు పట్టించాలి. పిల్లలను ఐస్ క్రీములు, కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. చాక్లెట్లు, తీపి పదార్థాలు తీసుకోవడం వల్ల చాలా ఇబ్బందులు వచ్చే అవకాశాలున్నాయి. నవంబరు, డిసెంబరు, జనవరి నెలలో చలి, మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. దానివల్ల ఆస్తమా వచ్చే అవకాశం ఉంది.

చల్లని పానీయాలకు దూరంగా ఉండాలి

ఎం.గులాబ్ రాజ్ కుమార్, కాళ్ల పిహెచ్‌సి డాక్టర్

శీతాకాలంలో ఆస్తమా చిన్నారుల్లో ఎక్కువగా వస్తుంది. చిన్నారులు చల్లటి పదార్థాలు తీసుకోకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. అదేవిధంగా ఐస్ క్రీములు, కూల్ డ్రింక్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలి. ఆస్తమా లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

మత్స్యకారులకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించాలి

ప్రజాశక్తి - భీమవరం

జీవనోపాధి కోసం ఇతర జిల్లాలకు చేపల వేటకు వెళ్లి ప్రమాదాలకు గురైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించి కుటుంబాన్ని ఆదుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జల్లి రామ్మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరవాసరం మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన మత్స్యకారులు వైఎస్‌ఆర్ జిల్లా రొయ్యల పట్టుబడికి వెళ్లి తిరిగి వస్తూ కృష్ణా జిల్లాలో ప్రమాదానికి గురై భీమవరం ప్రయివేట్ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న వారిని ఆదివారం వారు పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు, సత్యనారాయణ మాట్లాడుతూ సోమవారం నరసాపురంలో ముఖ్యమంత్రి మత్స్య కార్మిక దినోత్సవ సభలో ప్రమాద బీమాను ప్రకటించాలని వారు కోరారు. ఏ రోజుకు కా రోజు కూలితో బతికే కుటుంబాలు ప్రయివేట్ ఆసుపత్రుల్లో వేలకు వేలు పెట్టి వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉందని, జిల్లా మత్స్య శాఖ అధికారులు స్పందించి వైద్య ఖర్చులకు కుటుంబ జీవనోపాధికి తక్షణ సాయం అందించాలని వారు డిమాండ్ చేశారు.

బాధితుడిని పరామర్శిస్తున్న సత్యనారాయణ

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు

గ్రంథాలయాలకు మౌలిక వసతులు కల్పిస్తాం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

55వ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 200 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడారు. గ్రంథాలయానికి కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ఉప ముఖ్యమంత్రి అందజేశారు. గారికిపాటి బాపయ్య శర్మ మాట్లాడుతూ వారం రోజులుగా జరిగిన కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కొట్టు విశాల్, వీరాస్వామి, సల్మాన్‌రాజు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా 600 సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆదివారం నిర్వహించారు. వేద పండితులు అనిపెద్ది ఫణికుమార్ శర్మ, దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి వ్రతాల ఆచరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేగేశ్న వెంకట సూర్యసత్యనారాయణరాజు (ఏడుకొండలరాజు) దంపతులు యాత్రికులకు అన్నవరప్రసాదం, స్వామివారి ప్రతిమలు, మండపారధన అందజేశారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధర్మకర్తల మండలి అధ్యక్షులు డివి కృష్ణంరాజు, ఆలయ కార్య నిర్వహణాధికారి సురేష్ నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


నరసింహరాజును సత్కరిస్తున్న సభ్యులు

పెనుమంట్రలో వన సమారాధనలు

హాజరైన ప్రజా ప్రతినిధులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో పెనుమంట్ర పల్లపు వీధిలో, మార్టేరు రెడ్డి కళ్యాణ మండపంలో వన సమారాధన కార్యక్రమాలు జరిగాయి. పెనుమంట్ర పల్లపు వీధిలో రెడ్డి యూత్ లైన్స్ ఆధ్వర్యంలో రెడ్డి యూత్ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ చిన్నారులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు తనయుడు నరసింహరాజు (నరేష్‌రాజు) ఇచ్చేశారు. మార్టేరు పంచ గ్రామాల రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి కళ్యాణ మండపంలో వన సమారాధన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, తూర్పుగోదావరి జిల్లా ఎంఎల్‌సి చిర్ల జగ్గిరెడ్డి విచ్చేశారు. పెనుమంట్రలో క్షత్రియ వన సమారాధన కార్యక్రమం నిర్వహించుకున్నారు.

చిరంజీవికి నాయకర్ సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం వైఎన్ కళాశాల అలుమ్ని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో నరసాపురం జనసేన నాయకుడు బొమ్మిడి నాయకర్ మెగాస్టార్ చిరంజీవితో కలిసి ఒకే వేదికపై పాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా నాయకర్ చిరంజీవిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకెన చంద్రశేఖర్, వలవల నాని, తోట నాని, యడ్లపల్లి మహేష్, యర్రంశెట్టి మధు, రావి ఉమ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గృహిణి ఆత్మహత్య

ప్రజాశక్తి - వీరవాసరం

గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వీరవాసరం పోలీస్ స్టేషన్ పరిధి చింతలకోటిగరువులో చోటు చేసుకుంది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... తోకలపూడి గ్రామానికి చెందిన దూసనపూడి నాగేశ్వరావు తన కుమార్తె నాగవేణి(40)ని 20 ఏళ్ల క్రితం చింతలకోటిగరువుకు చెందిన బండి ఏడుకొండలకు ఇచ్చి వివాహం చేశారు. మృతురాలికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతురాలి కుమార్తె ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తుంది. ఆమె తన తాతయ్య గ్రామం తోకలపూడి నుంచి కళాశాలకు రాకపోకలు సాగిస్తుంది. కుమారుడు చింతలకోటిగరువు నుంచే రాకపోకలు సాగిస్తూ ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్నాడు. ఈ క్రమంలో తన కుమార్తెను తన అల్లుడు నిత్యం తాగి వచ్చి కొడుతూ ఉండేవాడని, ప్రతిరోజు వారి మధ్య గొడవలు జరుగుతూ ఉండేవని మృతురాలి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ క్రమంలో నాగవేణి ఉరేసుకుందని స్థానికుల ద్వారా సమాచారం రావడంతో తండ్రి నాగేశ్వరావు హుటాహుటిన చింతలకోటిగరువుకు వెళ్లాడు. అపస్మారక స్థితిలో ఉన్న కుమార్తెను చూసి అక్కడే ఉన్న తన మనవడిని అడుగగా ఎప్పటిలాగానే తన తల్లిదండ్రులు గొడవ పడ్డారని గొడవ కారణంగా తన తల్లి నాగవేణి ఉరేసుకుందని తెలిపాడు. వెంటనే నాగవేణిని భీమవరం అక్కడ నుంచి ఏలూరు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని పారిశుద్ధ్య కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి - పెనుగొండ

బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై ఇద్దరు కార్మికులు గాయాలపాలైన ఘటన మండలంలోని దొంగరావిపాలెం మార్కెట్ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వడలి పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు వేమవరానికి చెందిన మాకా పిట్ట సత్యనారాయణ, వడలి గ్రామానికి చెందిన వేలంగి రాజు బైక్‌పై ఆదివారం వ్యక్తిగత పనుల నిమిత్తం సిద్ధాంతం బయలుదేరారు. ఈ క్రమంలో మండలంలోని దొంగరావిపాలెం మార్కెట్ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. సత్యనారాయణ తణుకులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజును ఏలూరు ఆశ్రమ ఆసుపత్రికి తరలించారు.

అస్తికలు పోయాయంటూ ఫిర్యాదు

పాలకొల్లు : తన భార్య అస్తికలు పోయాయంటూ ఓ న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం... పాలకొల్లుకు చెందిన న్యాయవాది కోడూరి వెంకటేశ్వరావు తన భార్య అనారోగ్యంతో ఈ నెల 14న చనిపోగా 15న పాలకొల్లు కైలాసంలో అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం 16న చినకర్మ ముగించుకుని అస్తికలను కైలాస వనంలోని లాకర్ రూమ్‌లో భద్రపరిచాలని కాటికాపరికి అప్పగించారు. ఆదివారం అస్తికలను గోదావరిలో కలిపేందుకు కైలాస వనానికి వెళ్లి కాటికాపరిని అస్తికలు ఇవ్వమనగా లాకర్‌రూమ్‌లో అస్తికలు లేవని పోయాయని సమాధానం చెప్పాడు. దీంతో కాటికాపరిని నిలదీయగా అతను పరారయ్యాడు. అస్తికలను నదిలో కలిపితే ఆత్మ శాంతిస్తుందని నమ్మకం ఉండడంతో ఆ అస్తికలు పోవడంతో వెంకటేశ్వరావు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. దీనిపై న్యాయవాది పాలకొల్లు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్లలో జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం హౌసింగ్ డిఇ పి.శివరామరాజు ప్రధానమంత్రి యోజన పథకం లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఎఇ పి.ఆంజనేయరాజు మాట్లాడుతూ కాళ్ల మండలానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం లో 21 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. కాళ్లలో నాలుగు, కాళ్లకూరులో ఆరు, జువ్వలపాలెంలో నాలుగు, సీసలిలో రెండు, పెదఅమిరంలో మూడు, బొండాడ, వేంపాడు గ్రామాల్లో ఒకటి చొప్పున ఇళ్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సతీష్‌కుమార్, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు చేస్తున్న హౌసింగ్ డిఇ శివరామరాజు

కాళ్ల: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంపై మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. మండలంలో పలు పంచాయతీల్లో చేపడుతున్న పిఎంఏవై, జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసేలా సచివాలయ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.కిషోర్ కుమార్ కోరారు. ఎంపిడిఒ జి.స్వాతి మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ఇళ్ల నిర్మాణం ఎలా జరుగుతున్నాయో అడిగితెలుసుకున్నారు. హౌసింగ్ డిఇ పి. శివరామరాజు మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ పి.ఆంజనేయరాజు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం..

ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఉద్యోగుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు తెలిపారు. లయన్స్ కమ్యూనిటీ హాల్లో పాలకొల్లు తాలూకా ఎన్‌జిఒ యూనిట్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఎన్నికల నిర్వహణలో తణుకు తాలూకా ఎన్‌జిఒ యూనిట్ అధ్యక్షులు కెవి.నరసరాజు, కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు. పాలకొల్లు తాలూకా యూనిట్ అధ్యక్షులుగా గుడాల హరిబాబు, కార్యదర్శిగా వేగేశ్న మురళీకృష్ణంరాజు, కోశాధికారిగా డివి.రమణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎంఆర్‌కె.రాజు, ఉపాధ్యక్షులుగా ఎ.శ్రీనివాసరాజు, జివిఎల్ నరసింహారావు, ఎం.రామకృష్ణ, జాయింట్ సెక్రటరీలుగా సిహెచ్ విఆర్‌ఎస్ పార్థసారథి, చందక కుమార్ రాజా, వై.లోకేష్ ఎన్నికయ్యారు. మహిళా సెక్రటరీగా కె.మధులత, 12 మంది ఇసి మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా విభాగం ఛైర్ పర్సన్‌గా జె.అనూష, కో ఛైర్ పర్సన్‌గా ఆర్.ఉమారాజశ్రీ, కన్వీనర్‌గా ఎ.రామకిరణ్మయి, కోకన్వీనర్‌గా ఎం.మార్తమ్మ, ఇసి మెంబర్స్‌గా ఎ.గౌరీదేవి, ఎం.రేవతి, ఎన్.లిల్లీ కుమారి, బి.రాధిక ప్రియదర్శిని ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి కెవి నరసరాజు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు చౌడగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ 50 సంవత్సరాల చరిత్ర కలిగిన ఎపి ఎన్‌జిఒ సంఘం ఉద్యోగుల ప్రయోజనం చేకూర్చే జిఒలను సాధించినట్లు తెలిపారు. అందులో పిఆర్‌సి ఫిట్మెంట్ ఒకటని చెప్పారు. పెన్షన్, డిఎ ఇతర అలవెన్సులు సాధించడం జరిగిందన్నారు. ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు దగ్గర చేస్తూ అమలులో నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు, కార్యదర్శి ఎన్‌వి రామారావు, రాష్ట్ర జెఎసి కార్యదర్శి జనరల్ ఆర్‌ఎస్ హరనాథ్ పాల్గొన్నారు.


పాలకొల్లు పాత తాలూకా నూతన కార్యవర్గం

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మొగల్తూరు పంచాయతీ పరిధి గుంటపల్లవపాలెంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి రామ్మోహన్‌రావు జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలవుతున్నా మత్స్యకారుల సమస్యలు నేటికీ పరిష్కారం కావడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలోని తీర ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్లు కట్టిస్తామని చెప్పినా అవి నేటికీ అమలు కాలేదన్నారు. వాగ్దానాలు చేయడం తప్ప ఆచరణలో శూన్యమని విమర్శించారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మైలవానిలంక తదితర ప్రాంతాల్లో పర్యటించి రాబోయే ఎన్నికల్లో ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడానికి తప్ప మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఏ మాత్రమూ చిత్తశుద్ధి లేదని తెలిపారు. నరసాపురం గోదావరి ఖరాకట్ట తక్షణం కలవట్ గోడను నిర్మించాలని, బియ్యపుతిప్పలో మినీ ఫిషింగ్ హార్బర్ నిర్మించడం వల్ల మత్స్యకారులకు వేట చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే మత్స్యకారులు ప్రతిఘటన ద్వారా ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఒడుగు శ్రీనివాసరావు, తిరుమాని ముత్యాలరాజు, తిరుమాని తాతయ్య, కె.శ్రీనివాసరావు, బర్రి లక్ష్మి స్వామి కొల్లాటి కృష్ణ పాల్గొన్నారు.

బిసిలంతా ఐక్యంగా ఉండాలి

రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి- పాలకోడేరు

బీసీలంతా ఐక్యంగా ఉంటే సాధించలేనిదేమీ లేదని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య సూచించారు. పాలకోడేరులోని మాజీ సర్పంచి ఆళ్ల అప్పలరాజు ఇంటికి ఆయన ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆళ్ల అప్పలరాజు, తొలగించబడిన 26 బిసి కులాల పోరాట సమితి అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణలు కృష్ణయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కృష్ణయ్య మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో బిసిల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు ఎన్నో పోరాటాల ఫలితమే అన్నారు. ఒక జాతి ఉన్నత స్థితికి చేరాలంటే జాతి మొత్తం ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. బిసిలు రాజకీయంగా ఉన్న స్థానాల్లో నిలబడి తమ జాతి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. త్వరలో భీమవరం పరిసర ప్రాంతాల్లో భారీ స్థాయిలో నిర్వహించే బిసిల ఐక్యత సభకలో తాను పాల్గొంటానన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ, అప్పలరాజు అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు చరకణం వెంకటేశ్వరరావు, పెంటకోటి మాధవరావు, ఆళ్ల నాగేశ్వరరావు, కొణతాల శివప్రసాద్, మల్ల శివయ్య, ఆళ్ల చంట, చిలపరశెట్టి వరప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు జాతీయ బిసి సంఘం అధ్యక్షులు కృష్ణయ్య

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- భీమవరం

ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని అన్ని నియోజక వర్గాల్లో 1,962 వైఎస్ఆర్ పశు ఆరోగ్య సేవా రథాలు (సంచార పశు వైద్య వాహనాలు)ల్లో పని చేసేందుకు వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, పైలట్స్ (డ్రైవర్స్) భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పశు వైద్య అధికారి ఎస్‌జిటి.సత్య గోవింద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రెండో విడతలో భాగంగా సంచార పశు సేవా 1,962 వాహనాలు పంపిణీ చేయడం ద్వారా పూర్వపు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కోసం ఎంపిక ప్రక్రియను మేసర్స్ జివికె సంస్థ ద్వారా చేపడుతున్నామన్నారు. నవంబర్ 22, 23 తేదీల్లో గోకవరం బస్టాండ్ సమీపంలో ఉన్న జిల్లా పశు వైద్య శాల, జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఆయా పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలను నిర్వహించి, సర్టిఫికెట్స్ పరిశీలించనున్నట్లు తెలిపారు. పశు వైద్యుల పోస్టులకు బివి ఎస్‌సిలో ఉత్తీర్ణత, ఉద్యోగ విరమణ, బి పేరా వెటర్నరీ సిబ్బందికి డిప్లొమా ఇన్ వెటర్నిటీ సర్వీస్, (30 ఏళ్ల లోపు వయసు), బీ పైలట్ (డ్రైవర్)కి పదో తరగతి లేదా ఎస్‌ఎస్‌ఇ, హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ కనీసం రెండు మూడేళ్ల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఈ నెల 22వ తేదీ ఉదయం పది గంటల లోపు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో రాజమహేంద్రవరం, జిల్లా పశు వైద్య శాల వద్ద నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు జివికె సంస్థ ప్రాంతీయ కో-ఆర్డినేటర్ మోహన్‌గాంధీ 9160566668 సంప్రదించాలని తెలిపారు.

యాత్రికులకు బాదంపాలు పంపిణీ

ప్రజాశక్తి - పాలకొల్లు

పంచారామ క్షేత్రం పాలకొల్లులోని క్షీర రామలింగేశ్వర స్వామివారిని కార్తీక మాసం ఆఖరి ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గేదెల లక్ష్మణరావు ఆర్థిక సాయంతో భక్తులకు బాదంపాలు పంపిణీ చేశారు. ప్రిన్స్ సంస్థ అన్నవరం ప్రసాదం, పాలు పంపిణీ చేశారు. ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యాళ్ల సూర్యనారాయణ, ట్రస్టీలు పర్యవేక్షించారు.

'పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టేందుకు పోరాటం'



భీమవరంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టేందుకు పోరాడుతున్నానని జాతీయ బిసి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఆర్.కృష్ణయ్య అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కోడి యుగంధర్ ఆధ్వ ర్యంలో 139 బిసి కులాల కార్తీక వన సమారాధన కార్య క్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో యుగంధర్ మాట్లాడుతూ చట్ట సభల్లో ఎస్‌సి రిజర్వేషన్ మాదిరిగా, బిసి రిజర్వేషన్ కూడా రావాలని, రాజకీయ పార్టీలు బిసిలకు సీట్లు ఇస్తున్నా గెలిపించుకోలేకపోతున్నారని చెబుతున్నాయని, రిజర్వేషన్ ఉంటే బిసి మీద బిసి పోటీపడి ఎవరు గెలిచినా బిసి నాయకుడు ఉంటారన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బిసిలందరూ ఐకమత్యంగా పోరాడి హక్కులను సాధించుకో వా లన్నారు. తను పోరాటం మొదలుపెట్టి 48 ఏళ్ల నుంచి 50 ఏళ్లు కావస్తుందని, ఈ పోరాటంలో ఎన్నో సాధించామని చెప్పారు. బిసి సంక్షేమానికి సంబంధించి 2000 పైగా జిఒలను పోరాడి సాధించామన్నారు. గతంలో బిసిలకు ఎటువంటి రిజర్వేషన్లు లేకపోవడంతో విద్య సైతం ఉండేది కాదని, ఆ సమయంలో అసలు అసెంబ్లీపై దాడి చేసి విద్యార్థుల స్కాలర్‌షిప్పులు గురుకుల పాఠశాలలో సాధించా మన్నారు. శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు మాట్లాడుతూ బిసి లేకపోతే సమాజమే లేదన్నారు. సమాజ సృష్టికర్తలు వారేనన్నారు. రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేద్కర్ తమ గురువు బిసి నేత జ్యోతిరావు పూలే అని చెప్పేవారన్నారు. జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి మేక శేషుబాబు, డిసిఎంఎస్ ఛైర్మన్ వేంద్ర వెంకటస్వామి మాట్లాడుతూ 56 శాతం బిసిలు ఐక్యంగా ఉంటే చట్టసభల్లో రాజ్యాధికారం సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కాంట్రికం సింహం నరసింహారావు, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్, రాష్ట్ర కార్యదర్శి వనమాల శ్రీనివాస్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లగాని సత్యనారాయణ, సంచారజాతుల సంక్షేమ సంఘం ఛైర్మన్ పెంట్రా వీరన్న, కృష్ణ బలిజ రాష్ట్ర కార్యదర్శి గంట త్రిమూర్తులు, ముస్లిం కమిటీ నాయకులు, నౌషద్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన్ నాగేశ్వరరావు, పాక సత్యనారాయణ, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు వాటాల పెద్దిరాజు, కడలి ధర్మారావు, చింతపల్లి గురు ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ సభ్యుల..

మొగల్తూరు :ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆదివారం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం మొగల్తూరులోని జంగిల్ ఛానల్ సమీపంలో ఉన్న తుంపూడి మల్లేశ్వరరావు తోటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక సమారాధనను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులు, పెద్దలు ఆట పాటలతో ఆహ్లాదంగా గడిపారు. ఉదయం ఉసిరి చెట్టు వద్ద సత్యనారాయణ స్వామి వ్రతం, మహిళలు వాసవి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా తోటలో అంత్యాక్షరి, మ్యూజికల్ ఛైర్స్, క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు.

మొగల్తూరులో ఆటల పోటీల్లో మహిళలు

యువజన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో లక్కీ డిప్, హౌసి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

కళింగ సంఘం ఆధ్వర్యంలో...

ఉండి : శ్రీ అభయ ఆంజనేయ కళింగ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఎన్‌ఆర్‌పి అగ్రహారం గ్రామ మాజీ సర్పంచి మునుకోలు సింహాచలం అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కార్తీక మాసం వన సమారాధన భోజనాలకు ముఖ్యఅతిథిగా డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ మనలో సమైక్యత భావం పెంపొందించడానికి వన సమారాధన భోజనాలు దోహదపడతాయన్నారు. కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో ఉండి మండలంలో కళింగ సంఘం సభ్యులను పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరిని ఏకం చేసి ఒకే చోట కలుసుకునేలా చేయడం అభినందనీయమన్నారు. రాజకీయాలు అనేవి కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే పనికి వస్తాయని మిగిలిన రోజుల్లో అందరూ సోదర భావంతో మెలగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మునుకోలు సింహాచలంను పివిఎల్ నరసింహరాజు అభినందించారు. అనంతరం పివిఎల్‌ను కళింగ సభ్యులు శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆల య కార్య నిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణం రాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది యాత్రికు లకు ఎటు వంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేశారు.

ఐఐఎం శిక్షణ తరగతులకు హెచ్‌ఎం బాలనాగమణి

మొగల్తూరు :గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన ఐఐఎం శిక్షణ తరగతులకు ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.బాలనాగమణి ఎంపికయ్యారు. గుణాత్మక విద్య నాయకత్వంపై ఐదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులకు ఆమె హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్టాఫ్ సెక్రటరీ చింతపల్లి కృష్ణమోహన్, సర్పంచి కె.పల్లయ్య, పాఠశాల సిబ్బంది అభినందించారు.


బోసురాజును పరామర్శిస్తున్న జుత్తిగ నాగరాజు

బోసురాజుకు జుత్తిగ నాగరాజు పరామర్శ

ఉండి :ఇటీవల చిలుకూరు గ్రామ వైసిపి నాయకుడు చేకూరి శ్రీని వాసరాజు (బోసు రాజు) తండ్రి విశ్రాంత ఉపా ధ్యాయులు చేకూరి వెంకట సుబ్బ రాజుమృతి చెం దారు. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ పార్టీ నాయకులు జుత్తిగ నాగరాజు బోసురాజును పరామర్శించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ వెంకటసుబ్బ రాజు మాస్టర్ గ్రామ పెద్దగా విద్యా దాతగా చేసిన విశేష సేవలను కొనియాడారు. చిలుకూరులో పాఠశాల భవన నిర్మాణాల్లో తమ వంతు సహకారం అందించి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు ప్రభుత్వం నుంచి ప్రతి సంవత్సరం అందుకున్నారని గుర్తు చేశారు. సుబ్బరాజు మాస్టారు మృతికి సంతాపం, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 23/2017
ఓ.ఎస్.నెం. 321/2011

బిట్వీన్:
మాకా నాగేశ్వరరావు ...డి. హెచ్.ఆర్
Vs
పర్వతాల ఆంజనేయులు ...జె.డి.ఆర్

పై నెంబరు ఇ.పి. నందు శ్రీ కోర్టు వారు షెడ్యూలు ఆస్థిని **ది.08-12-2022వ తేదీన వేలం జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చినారు.** కావున షెడ్యూలు ఆస్థి యొక్క వేలము పై కోర్టులో ఉదయం గం|| 10:30 ని||లకు నిర్వహించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

ప||గో||జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్, ఉంగుటూరు మండలం, ఉప్పాకపాడు గ్రామం జిరాయితీ పల్లం, సర్వే నెం.451/2 నందు య.0-50 సెంట్లుకు హద్దులు:
తూర్పు: మంచాల వీరరాఘవమ్మ గారి భూమి.
పడమర: మాకా చినపోతురాజు గారి భూమి.
ఉత్తరం: మాకా వెంకటలక్ష్మి గారి భూమి.
దక్షిణం: పుంత.

అమీనా కిమ్మత్తు
జప్తు సమయమందు : రూ.2,50,000/-
టెస్టు వారెంటు సమయమందు : రూ.18,00,000/-

జి.కె.దుర్గాదేవి
వాది తరుపు అడ్వకేట్,
తాడేపల్లిగూడెం.
తాడేపల్లిగూడెం,
19-11-22. సెల్: 9985592775

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: ELUU
E.P.No.6/2021, O.S.No.416/2015

Between:
Sri Mavuluri Srinivas ...DHR
Vs
Sri Chintapalli Veera Sesha Rao ...JDR

పై నెంబరు గ్రంథములో జె.డి.ఆర్. స్వాధీన హక్కు భుక్తములో ఉన్న ఈ దిగువ ఇ.పి. షెడ్యూలు ఆస్థిని **ది.09-12-2022వ తేదీన ఉదయం గం|| 10:30 ని||లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలము వెయ్యబడును.** కావున వేలము పాటలో పాల్గొనే వారు తమ ఆధారు కార్డుతో ఉదయం గం|| 10:30 ని||లకు వచ్చి వేలముపాటలో పాల్గొనవలసిందిగా కోర్టు వారు ఆర్డరు ప్రకారం ఇందుమూలముగా తెలియజేయడమైనది.

SCHEDULE

West Godavari District, Velagapadu Village and Panchayat, T.Narasapuram Mandal, Kamavarapukota Sub Division, Zaroyet R.S.No.100/3, AC. 1-88 Cents out of AC. 3-76 Cents and R.S.No. 100/4, AC. 0-15 Cents out of AC. 0-30 Cents, one campact block total extent of AC. 2-03 Cents.

Bounded By: Item No.1:
East: Jajula Rama Swamy Land.
South: Allamcharla Rajupalem to Barrampalem Road.
West: Velagapadu Village.
North: Chintapalli Nageswara Rao.
DHR Value : Rs.10,00,000/-
Amin Value : Rs.20,30,000/-

Item No.2:
West Godavari District, Velagapadu Village and Panchayat, T.Narasapuram Mandal, Kamavarapukota Sub Division, Zaroyet R.S.No.133/1, AC. 1-70 Cents out of AC. 3-40 Cents.

Bounded By:
East: Government Puntha.
South: Chintapalli Nageswara Rao.
West: Defendent and Chintapalli Nageswara Rao.
North: Tank.
DHR Value : Rs.8,00,000/-
Amin Value : Rs.17,00,000/-

P.B.NARASIMHAMURTHY
Advocate, Eluru.
Cell: 98481 43125